సాక్షి
కుమురం భీం

మంగళవారం । 27 । ఆగస్టు । 2024


జిల్లా కేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


కౌటాలు: తలోడిలో కృష్ణుడి వేషధారణలో చిన్నారి


ఆసిఫాబాద్‌రూరల్‌: శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారి లోకనాథ్‌


కాగజ్‌నగర్‌రూరల్‌: ఉట్టి కొట్టే వేడుకలో చిన్నారులు


జిల్లా కేంద్రంలో ఉట్టి కొడుతున్న బాలుడు


శ్రీకృష్ణుడి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న యాదవ సంఘం నాయకులు


గోపిక వేషధారణలో చిన్నారి తపస్య

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ముస్తాబు చేసి మురిసిపోయారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో యాదవ సంఘం, జై యాదవ్‌ జై మాధవ్‌ యూత్‌ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఇంటి నుంచి శ్రీకృష్ణుడి చిత్రపటంతో డీజే చప్పుళ్లు, బ్యాండు మేళాలతో పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం సంఘ భవనంలో పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌, నాయకులు శరత్‌, ప్రణయ్‌, గుండా వెంకన్న, ప్రసాద్‌గౌడ్‌, పెంటు, శ్రీశైలం, ముషీర్‌, సదాశివ్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాఫీ అయ్యేనా.. చిక్కులు తొలగేనా!

- నేటి నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్వే
- ఇంటింటికీ వెళ్లి రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరణ
- ధ్రువపత్రాల పరిశీలన.. ప్రత్యేక యాప్‌లో నమోదు
- జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 11,026 ఫిర్యాదులు


దహెగాంలో అర్జీలు స్వీకరిస్తున్న నోడల్‌ అధికారి(ఫైల్‌)

ఆసిఫాబాద్‌: జిల్లావ్యాప్తంగా చాలామంది రైతులు అర్హులైనా రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డు, ఇతర సాంకేతిక కారణాలతో బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మూడో విడత తర్వాత కూడా మాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తోంది. ఏడీఏ, ఏవో కార్యాలయాలతోపాటు రైతువేదికల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటున్నారు. అలాగే రుణమాఫీ వర్తించని రైతుల వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివరాల సేకరణ కోసం ప్రత్యేకంగా రైతు భరోసా పంట రుణమాఫీ యాప్‌ రూపొందించారు. ఈ యాప్‌ను ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు పంపించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం నుంచి సర్వే చేపట్టనున్నారు. ముందుగా ప్రయోగాత్మకంగా కొందరి రైతుల వివరాలు నమోదు చేసి పరీక్షించాలని ఆదేశించడంతో.. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రయోగాత్మకంగా వివరాలు సేకరించారు.

48,356 మందికే మాఫీ

జిల్లాలో 1.38 లక్షల మంది రైతులు ఉండగా, సుమారు 1.19 లక్షల మంది పంట రుణాలు తీసుకున్నట్లు సమాచారం. వీరిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు 22 వేల మందికి తొలివిడతలో రూ.125.20 కోట్లు, రెండో విడతలో రూ.1.5 లక్షల లోపు తీసుకున్న వారు 14,623 మందికి రూ.253.34 కోట్లు, మూడోవిడతలో రూ.2 లక్షల లోపు తీసుకున్న వారు 11,733 మందికి రూ.154.40 కోట్ల రుణాలు మాఫీ చేశారు. మొత్తంగా 48,356 మంది రైతుల ఖాతాల్లో రూ.532,94,17,306 నగదు జమ చేశారు.

వెల్లువలా ఫిర్యాదులు

రైతు రుణమాఫీ అందని వారు ఫిర్యాదు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో గ్రీవెన్స్‌ సెల్‌ ఏర్పాటు చేయడంతోపాటు కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రుణమాఫీ కాని వారితోపాటు రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. మాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను అడిగితే వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఆధార్‌ కార్డు ద్వారా చెక్‌ చేస్తే 'నో డేటా ఫౌండ్‌' అని వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌ కార్డు లేక పోవడం, ధ్రువపత్రాల్లో పేర్లు తప్పుగా నమోదు కావడం, ఇతర సాంకేతిక కారణాలతో మాఫీ కానివారు ఇప్పటివరకు 11,026 ఫిర్యాదులు అందించారు. వివరాలు పరిశీలించిన అనంతరం అధికారులు ఏఈవోలతో సర్వే చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం 15 మండలాలకు ఒక్కో నోడల్‌ అధికారిని నియమించారు. అయితే బ్యాంకర్లు, సహకార సంఘాల తప్పిదాలతోనూ అన్నదాతలు మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం విధించిన కటాఫ్‌ డేట్‌ 2018 డిసెంబర్‌ 12కు ముందు రుణాలు తీసుకున్న రైతులు ఆ తర్వాత ఏటా రుణాన్ని రెన్యూవల్‌ చేసుకుంటున్నారు. రెన్యూవల్‌ చేసిన తేదీ నుంచి కొత్త రుణంగా పరిగణించాలి. సదరు రుణానికి సంబంధించి కొత్త ఖాతా నంబర్‌ ఉంటుంది. బ్యాంకర్లు 2018 డిసెంబర్‌ 12కు ముందు తీసుకున్న రైతుల రుణాలను వారు ఏటా రెన్యూవల్‌ చేస్తున్నా కొత్త తేదీలు ఇవ్వలేదు. వారు పాత జాబితాలో ఉండటంతో అనేక మంది అనర్హులుగా మిగిలారు.

సర్వే ఇలా..

జిల్లాలో చాలామంది రేషన్‌ కార్డు లేకపోవడం, ఆధార్‌ కార్డులో తప్పులు, పట్టా పాస్‌పుస్తకం పేరుతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో రుణమాఫీకి దూరమయ్యారు. మంగళవారం నుంచి వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ వర్తించని రైతుల వద్దకు వెళ్లనున్నారు. తొలుత వారి లోన్‌ అకౌంట్లు, ఆధార్‌ కార్డులు తనిఖీ చేస్తారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా తీసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. పంట రుణాలు బకాయి ఉన్న భార్యాభర్తలే కాకుండా ఇంట్లో 18 సంవత్సరాలు దాటిన వారి కుటుంబ సభ్యుల ఫొటోలు కూడా తీసుకుంటారు. అందులో యజమాని తన లోన్‌ అకౌంట్‌, సంబంధిత బ్యాంకు బ్రాంచి వివరాలతోపాటు రుణమాఫీ కోసం కుటుంబసభ్యుల వివరాలను ఇష్టపూర్వకంగా రాసి ఇస్తున్నట్లు పేర్కొంటూ సంతకం చేయాల్సి ఉంటుంది. అందులోనే ఫోన్‌ నంబర్‌ రాయాలి. పూర్తి వివరాలు నమోదు చేసుకున్న అనంతరం యాప్‌లో నమోదు చేస్తారు. వివరాలు నమోదైన తర్వాత రైతుల నుంచి ధ్రువీకరణ పత్రం, స్థానిక పంచాయతీ కార్యదర్శి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది.



ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వేలో భాగంగా సేకరించిన ఓ రైతు వివరాలు

ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

అర్హులైనా రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ కాని రైతుల ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. అలాగే మంగళవారం నుంచి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సర్వే ద్వారా వివరాలు సేకరిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే వివరాలు యాప్‌లో నమోదు చేస్తాం. రైతులు సర్వే సిబ్బందికి సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలి. – రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఆంక్షలు పెట్టొద్దు



దహెగాం: ప్రభుత్వం రూ.2లక్షల వరకు ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా అర్హులైన వారందరికీ రుణాలు మాఫీ చేయాలి. నా పేరున రూ.2.10 లక్షల రుణం ఉండగా ఇప్పటివరకు మాఫీ కాలేదు. రుణం చెల్లించేందుకు బ్యాంకుకు వెళ్తే ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని బ్యాంకర్లు చెబుతున్నారు. అయోమయంలో ఉన్నాం. – పుప్పాల శ్రీనివాస్‌, దహెగాం

స్పష్టత ఇవ్వాలి



రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్నవారు మిగితా డబ్బులు చెల్లించాలని చెబుతుండటంతో బ్యాంకు వెళ్లా. డబ్బులు చెల్లిస్తా అంటే గైడ్‌లైన్స్‌ లేవు అంటున్నారు. నాకు, నా కొడుకు ఇద్దరి పేరుతో బ్యాంకులో రూ.2.35లక్షల పంట రుణం ఉంది. మాకు మాఫీ వస్తుందా.. రాదా.. అనే దానిపై స్పష్టత ఇవ్వాలి. – దెబ్బటి వైకుంఠం, దహెగాం

'సమగ్ర' ఉద్యోగుల పోరుబాట


కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు (ఫైల్‌)

- రెగ్యులరైజేషన్‌ కోసం ఏళ్లుగా నిరీక్షణ
- ఇప్పటికే 'చలో అసెంబ్లీ' చేపట్టిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు
- 28న కలెక్టరేట్‌ ఎదుట ధర్నాకు పిలుపు

ఆసిఫాబాద్‌అర్బన్‌: విద్యారంగంలో కీలకపాత్ర పోషించే సమగ్ర శిక్షా ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నారు. నెలల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

ఏళ్లుగా ఆందోళనలు

సమగ్ర శిక్షా విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది విధులు నిర్వర్తిస్తుండగా.. కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో 498 మంది పని చేస్తున్నారు. సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంతోపాటు కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, ఎంఈవో కార్యాలయాల్లో వివిధ క్యాడర్‌ పోస్టుల్లో ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం వీరు పదేళ్లకు పైగా పోరాడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తారని ఆశించినా వారికి నిరాశే ఎదురైంది. గతేడాది ఎన్నికలకు ముందు ఆందోళనలు ఉధృతం చేశారు. అప్పుడు వివిధ పార్టీల నాయకులు హామీలు గుప్పించారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా తమ డిమాండ్లపై దృష్టి సారించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల చలో అసెంబ్లీ చేపట్టి హైదరాబాద్‌లో నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ నెల 28న ధర్నా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

డిమాండ్లు ఇవీ...

వేతనాలు పెంచడంతోపాటు ఎలాంటి షరతులు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్‌ చేస్తున్నారు. 61 ఏళ్ల వారికి ఎలాంటి బెనిఫిట్స్‌ అందించకుండా రిటైర్మెంట్‌ చేయించేలా తీసుకువచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలంటున్నారు. జీవితబీమా కింద రూ.10లక్షలు, ఆరోగ్య బీమా కింద రూ.5లక్షలు అందించాలని కోరుతున్నారు.

న్యాయం చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి సమగ్ర శిక్షా పరిధిలోని పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలి. విద్యాశాఖలో ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నాం. మా శ్రమను ఇప్పటికైనా గుర్తించాలి. మా కుటుంబాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి. – నగేశ్‌, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగి

ప్రభుత్వంపై విశ్వాసం ఉంది



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలను ఆందోళనల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం. మా సమస్యలు పరిష్కరిస్తుందని విశ్వాసంతో ఉన్నాం. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నాం. ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి. – విజయలక్ష్మి, ఎస్‌ఎస్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు

న్యూస్‌రీల్‌

'వైద్యం అందక ఇబ్బందులు'


రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

జైనూర్‌(ఆసిఫాబాద్‌): గిరిజన ప్రాంతంలోని ప్రజలకు సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని కుమురంభీం కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిపై ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై సాగర్‌ ఘటనాస్థలికి చేరుకుని సముదాయించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్‌ ప్రఖండ అధ్యక్షుడు ఆత్రం భీంరావు, హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్‌ డోంగ్రే సమాధాన్‌, జిల్లా కార్యదర్శి ముండే సతీష్‌, నాయకులు చహక్కటి గణేష్‌, నాగర్‌గోజే ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పులి దారికి లైన్‌ క్లియర్‌

- తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో అధికారుల చర్యలు
- ఇటిక్యాల పహాడ్‌ గ్రామస్తులకు భూమి కేటాయింపు
- మిగితా ప్రాంతంలో ప్లాంటేషన్‌ ఏర్పాటు
- పెద్దపులి రాకపోకలకు ఆటంకం లేకుండా మొక్కల పెంపకం


ఇటిక్యాల పహాడ్‌ గ్రామ శివారులో భూమి కొలతలు తీస్తున్న అధికారులు(ఫైల్‌)

సిర్పూర్‌(టి): మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని సిర్పూర్‌(టి) రేంజ్‌ పరిధిలో పెద్దపులి రాకపోకలకు లైన్‌ క్లియర్‌ అయ్యింది. ఏళ్లుగా అటవీశాఖ, సిర్పూర్‌(టి) మండలం ఇటిక్యాలపహాడ్‌ గ్రామస్తుల మధ్య నెలకొన్న వివాదం సద్దుమణిగింది. గ్రామస్తులకు భూములు కేటాయించేందుకు అధికారులు అంగీకరించగా.. మిగిలిన ప్రాంతాల్లో ప్లాంటేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఫలితంగా మహారాష్ట్రలోని తాడోబా అటవీ ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతంలోకి పెద్దపులులు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఏర్పడింది.

బెబ్బులి రాకపోకలకు కీలకం..

మహారాష్ట్రలోని తాడోబా అభయారణ్యం నుంచి పెద్దపులులు జిల్లాలోని కాగజ్‌నగర్‌ అటవీ డివిజన్‌లోకి రాకపోకలు సాగించేందుకు మాకిడి సెక్షన్‌ పరిధిలోని ఇటిక్యాల పహాడ్‌ అటవీ ప్రాంతం ఎంతో కీలకమైంది. సరిహద్దులో ఉన్న ఈ గ్రామంలో 40 ఏళ్లుగా గిరిజనేతరులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూములు పూర్తిగా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయని స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. మూడేళ్ల వ్యవధిలో దాదాపు 200 ఎకరాల వరకు స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్‌ కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మరో 400 హెక్టార్లు స్వాధీనం చేసుకోవాలనే లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించడంతో వివాదం మొదలైంది. అధికారులు, గ్రామస్తుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా సమస్య కొలిక్కి రాలేదు. గ్రామంలో దాదాపు 190 కుటుంబాలు ఉన్నాయి. గిరిజనేతరులకు అటవీ భూములపై ఎలాంటి హక్కులు ఉండవని అధికారులు తేల్చి చెప్పారు.

మంత్రి సీతక్క దృష్టికి సమస్య..

భూములు లేకపోతే జీవనం కోల్పోతామని భావించిన గ్రామస్తులు సమస్యను ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గత నెలలో కాంగ్రెస్‌ పార్టీ సిర్పూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ప్రైవేట్‌ బస్సుల్లో గ్రామస్తులు హైదరాబాద్‌ వెళ్లి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిశారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆ తర్వాత అధికారులు గ్రామస్తులతో సమావేశమై చర్చలు జరిపారు. జీవనోపాధి కోసం ఒక్కో కుటుంబానికి నాలుగెకరాల చొప్పున కేటాయించాలని స్థానికులు కోరగా.. అధికారులు ఒప్పుకున్నారు. దీంతో ఏళ్లుగా నలుగుతున్న సమస్య పరిష్కారమైంది. మొత్తం 190 కుటుంబాల్లో అందులో పాత 150 కుటుంబాలకు నాలుగెకరాల చొప్పున.. అడ గ్రామం నుంచి ఇటీవల కాలంలో ఇక్కడ స్థిరపడిన 40 కుటుంబాలకు రెండెకరాల చొప్పున కేటాయించాలని నిర్ణయించారు. నెలరోజులుగా సర్వే చేసిన అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఇటిక్యాల పహాడ్‌ గ్రామ శివారులోని భూములకు హద్దులు గుర్తించారు. విడతల వారీగా గ్రామస్తులకు భూమి కేటాయిస్తున్నారు.

ఇటిక్యాల పహాడ్‌ ప్లాంటేషన్‌ సందర్శన


ప్లాంటేషన్‌ వద్ద ట్రెయినీ రేంజ్‌ అధికారులు

సిర్పూర్‌(టి): మండలంలోని ఇటిక్యాలపహాడ్‌ అటవీప్రాంతంలో అటవీశాఖ నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను సోమవారం శిక్షణలో భాగంగా అస్సాం అటవీశాఖ ట్రెయినీ రేంజ్‌ అధికారుల బృందం సందర్శించారు. డిప్యూటీ డైరెక్టర్‌ బి.వెంకటేశ్వర్‌రావు సమక్షంలో శిక్షణలో అధికారుల బృందానికి మొక్కల పెంపకం, వన్యప్రాణులు, పెద్దపులుల సంరక్షణ చర్యలు, ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, టైగర్‌ కారిడార్‌ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వారితో 300 మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో అప్పలకొండ, బెల్లంపల్లి రేంజ్‌ అధికారి పూర్ణచందర్‌, డిప్యూటీ రేంజ్‌ అధికారులు జి.శ్రీధర్‌ చారి, ప్రవీణ్‌కుమార్‌, ఎఫ్‌ఎస్‌వోలు మోహన్‌రావ్‌, ప్రసాద్‌, ఎఫ్‌బీవోలు నరేశ్‌, అరవింద్‌, శ్రీదేవి, రవీనా, హబీబా తబస్సుమ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

టైగర్‌ కారిడార్‌గా ఏర్పాటు

సిర్పూర్‌(టి) మండల రికార్డుల ప్రకారం ఇటిక్యాల పహాడ్‌ గ్రామం రెవెన్యూ విలేజ్‌గా లేదు. ఇక్కడ 413 మంది ఓటర్లు, 550 మంది జనాభా ఉంది. 2018లో నూతన పంచాయతీగా ఏర్పాటు చేసినా ఇక్కడ డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలు నిర్మించలేదు. ప్రస్తుతం అధికారులు భూములు కేటాయించినా హక్కుపత్రాలు, పట్టాలు మాత్రం ఇచ్చేందుకు అధికారులు హామీ ఇవ్వలేదు. ఒప్పందం ప్రకారం సాగుకు మాత్రమే అవకాశం కల్పించారు. హద్దులు దాటి సాగు చేసేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకోనున్నారు. పులుల ఆవాసానికి అనుకూలంగా ఉండటంతో టైగర్‌ కారిడార్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఈ అటవీ ప్రాంతంలో నీటి కుంటలు, సోలార్‌ పీటీలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 600 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసుకుని టైగర్‌ కారిడార్‌గా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఫిట్స్‌తో ఒకరు మృతి


ఇప్ప రవి (ఫైల్)

తాండూర్: ఫిట్స్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని బోయపల్లిలో చోటు చేసుకుంది. బోయపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలీ ఇప్ప రవి (38) రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

మందమర్రిరూరల్: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సౌన్నాయిల చిన్నయ్య(70) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అయిన చిన్నయ్య ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం భార్యతో గొడవపడి ఇంట్లోకి వెళ్లి చున్నీతో దూలానికి ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని పెద్ద కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

జైనూర్: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని వికర్‌సెక్షన్ కాలనీకి చెందిన పల్లపు లక్ష్మి (41)కి ముగ్గురు కుమారులు, కూతురు సంతానం. కూతురు వివాహనికి చేసిన అప్పులు ఎలాతీర్చాలో తెలియక ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించి ఎస్సై సాగర్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత


పర్సు అందజేస్తున్న సీఐ రవీందర్, ఎస్సై

చెన్నూర్: చెన్నూర్‌లో ఇటీవల నగదు, నగల పర్సు పోగొట్టుకున్న బాధితులకు సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు సోమవారం పోలీసు స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చెన్నూర్ పట్టణంలోని కోటపల్లి బస్టాప్ రావిచెట్టు వద్ద ఇద్దరు మహిళలు ఆటో నుంచి దిగుతూ రూ.24 వేల నగదుతో పాటు బంగారు ఆభరణలు ఉన్న పర్సు పోగొట్టుకున్నారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మూడు రోజుల్లో రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఇందుకు కృషి చేసిన హోంగార్డు ఖదీర్‌ను సీఐ అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కాసిపేట: మండలంలోని కోమటిచేను వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుకనుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం రాత్రి దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీ నుంచి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీని కోమటిచేను వద్ద వెనకనుంచి వచ్చిన మరోలారీ అదుపుతప్పి ఢీకొట్టడంతో డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మద్యం మత్తులోనే సంఘటన జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా మెలగాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్‌తో కలిసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

తోళ్లపరిశ్రమకు మోక్షమెప్పుడో?

- 2009లో అప్పటి సీఎం వైఎస్సార్ చేతుల మీదుగా భవనం ప్రారంభం
- 15 ఏళ్లుగా ఎదురుచూపులు
- అన్యాక్రాంతం అవుతున్న భూమి
- ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే, ఎంపీ హామీ
- పరిశ్రమ ఏర్పాటైతే వేలాది కుటుంబాలకు ఉపాధి


2009లో అప్పటి సీఎం వైఎస్సార్ ప్రారంభించిన తోళ్ల పరిశ్రమ భవనం



తోళ్ల పరిశ్రమకు సంబంధించిన శిలాఫలకం

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్థానిక కోల్‌బెల్ట్ ప్రాంత నిరుద్యోగ యువత కోసం తోళ్ల పరిశ్రమ (మినీ లెదర్‌పార్క్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సింగరేణి ఆధీనంలో ఉన్న సర్వేనంబర్ 148లోని 25 ఎకరాల భూమిని 2007లో అప్పటి చెన్నూర్ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వినోద్ ప్రభుత్వానికి కేటాయించి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి సుమారు రూ.10 లక్షల నిధులు కేటాయించారు. ఆ నిధులతో నిర్మించిన భవనాన్ని 2009 ఫిబ్రవరి 23న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. పరిశ్రమ ఏర్పాటైతే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలనే లక్ష్యంతో సుమారు 300ల మందికి 45 రోజులు తోళ్ల వస్తువుల తయారీపై మలుపు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కూడా అందించారు. కానీ 15 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నచందంగా ఉంది. ఇప్పటికైనా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమకు కావాలిృన నిధులు కేటాయించి త్వరగా ప్రారంభించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

అన్యాక్రాంతమవుతున్న భూమి...

సింగరేణి ఆధీనంలో ఉన్న 25 ఎకరాల భూమిని అప్పటి కార్మిక శాఖ మంత్రి గడ్డం వినోద్ ప్రభుత్వానికి సరెండర్ చేయించి తోళ్ల పరిశ్రమకు కేటాయించారు. ఆ తర్వాత పరిశ్రమ పనులు ఎవరూ పట్టించుకోకపోవడంతో భూమి అన్యాక్రాంతానికి గురైంది. ప్రభుత్వ కళాశాల కోసం ఐదెకరాలు, మున్సిపాలిటీ పార్క్ కోసం ఎకరం, 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కోసం కొంత స్థలాన్ని కేటాయించారు. అంతేకాకుండా పాలవాగు తీరం వెంట ఈ పరిశ్రమకు కేటాయించిన భూమి ఉండడం, ఎలాంటి కాపలా లేకపోవడంతో ఇసుక, మట్టి అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి తోడుకుపోయిన ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశ్రమకు కేటాయించిన భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుబంధ పరిశ్రమలకు, ఉపాధికి అవకాశం

మందమర్రిలో తోళ్ల పరిశ్రమ ఏర్పాటైతే అనుబంధ పరిశ్రమలు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సింగరేణి ఉద్యోగులకు బూట్లు, ప్లాస్టిక్ షూస్, షూ లేసులు, సాక్స్‌ల తయారీ, క్యాన్వస్ షూస్, స్టిచ్చింగ్, రివిట్‌మెంట్ అల్యూమినియం, కలర్ డై యూనిట్, స్కూల్ బ్యాగులు, ఎన్టీపీసీ, ఎస్టీపీసీ, దేవాపూర్, పోలీస్ బెటాలియన్, తదితర కంపెనీలకు కావాల్సిన మెటీరియల్ కూడా ఈ తోళ్ల పరిశ్రమ నుంచి తయారు చేసే అవకాశం ఉండడంతో అంతర్జాతీయంగా కూడా ఈ పరిశ్రమకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా వేలాది మందికి ఉపాధి అవకాశాలతో పాటు పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు జీవనోపాధికి అవకాశం లభిస్తుంది. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలిచిన వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ హామీ కూడా ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే ప్రారంభించాలి


మందమర్రిలో పదిహేనేళ్ల క్రితం ప్రారంభించిన తోళ్ల పరిశ్రమ పనులు పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలి. గత ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. శిక్షణ పొందిన వారికి సబ్సిడీ రుణాలు అందించాలి.

– విజయ్‌కుమార్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి

త్వరలోనే ప్రారంభిస్తాం


మందమర్రిలోని తోళ్ల పరిశ్రమ మిగులు పనులు పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తాం. ఇందుకు డీఎంఎఫ్‌టీ నిధుల్లో రూ.10 లక్షల మంజూరు చేయాలని కలెక్టర్‌కు సూచించా. ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పిస్తాం.

– గడ్డం వివేక్ వెంకటస్వామి, చెన్నూర్ ఎమ్మెల్యే

గిర్నాల శారదకు డాక్టరేట్


శారదను అభినందిస్తున్న సిబ్బంది

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన గిర్నాల శారదకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ఫిజిక్స్ మీద ఉన్న పట్టుతో 2017లో పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందానన్నారు. పరిశోధన అంశంపై డాక్టరేట్ వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను సోమవారం తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఆర్కే 6 గనిని సందర్శించిన డీడీఎంఎస్



గనిలోకి దిగుతున్న డీడీఎంఎస్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిని మెకానికల్ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) డీ.దిలీప్‌కుమార్ సోమవారం సందర్శించారు. రోప్ హాలేజీ సిస్టం తనిఖీలో భాగంగా కంపెనీ సేఫ్టీ అధికారులతో కలిసి గనిలోకి దిగి పనిస్థలాల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే రఘుకుమార్, ఏజీఎం(ఈఅండ్‌ఎం) రామనాథం, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో సోమవారం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక విభాగాల్లో అండర్-14, అండర్-17, సీనియర్స్, జూనియర్స్, మాస్టర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 200ల మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 20 మంది యోగా క్రీడాకారులు గోల్డెన్, సిల్వర్, బ్రౌన్స్ విభాగాల్లో పతకాలు సాధించారన్నారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ప్రోగ్రాం కన్వీనర్ బిల్ల మల్లయ్య, అధ్యక్షుడు తిరుపతి వర్మ, ప్రధాన కార్యదర్శి మండ శ్రీనివాస్ అభినందించారు.

నేటి ఏజెన్సీ బంద్ విజయవంతం చేయండి


కొండపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

కాసిపేట: ఆదివాసీల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 27న మంగళవారం తలపెట్టిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం మండలంలోని కొండపూర్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షుడు రాయిసిడం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బంద్

దండేపల్లి: ఏజెన్సీ ప్రాంత రక్షణకు చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాలు మంగళవారం తలపెట్టిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని, ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దండేపల్లిలో సోమవారం ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. తుడుందెబ్బ మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగు, అర్జున్, రాయిసెంటర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రదాన్ సంఘం అధ్యక్షుడు కాంతరావు, కాకోబాయి ఆలయ కమిటీ చైర్మన్ సోము, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఇంగిలి బాలయ్యతో పాటు అతని కుమారులు లింగయ్య, శ్రీనివాస్ సోమవారం పంటచేలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో పొగలు రావడంతో గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అప్పటికే ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. లింగయ్య తన కుమార్తె వివాహం కోసం ఇంట్లో ఉంచిన రూ.3లక్షలు, ఎనిమిది తులాల బంగారం, బట్టలు, ఇతర వస్తువులు, శ్రీనివాస్‌కు నూతన ఇంటి నిర్మాణం కోసం ఇంట్లో ఉంచిన రూ.2లక్షలతో పాటు నాలుగు తులాల బంగారం కాలిపోయింది. ఘటనలో సుమారు రూ.20లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ సభ్యులు

జైపూర్: మండల కేంద్రంలో సోమవారం ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ టీం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3, 4వ తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తర తెలంగాణ రీజనల్ డైరెక్టర్, మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కుతాడి తిరుపతి మాట్లాడుతూ యువతకు ఉపయోగకరమైన సూచనలు చేసే దిశగా మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంలో దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. టీం సభ్యులు జనార్దన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, భాస్కర్, సురేందర్, రాజిరెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

'పాఠశాలలో సైకాలజిస్ట్‌లను నియమించాలి'

మంచిర్యాలఅర్బన్: ప్రాథమిక స్థాయి నుంచి పాఠశాలలో సైకాలజిస్ట్‌లను నియమించాల్సిన అవసరం ఎంతో ఉందని, అప్పుడే పిల్లలు సన్మార్గంలో నడవడంతో పాటు ప్రేమను కలిగి భవిష్యత్‌కు మార్గాలు వేసుకుంటారని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాంచందర్ అన్నారు. సోమవారం మంచిర్యాలలో విలేకరులతో మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక శాస్త్ర అవగాహన ఎంతో అవసరమన్నారు. నేటికాలంలో బాల్యం నుంచి చెడు వ్యసనాలకు బానిసలై యువత బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్, మద్యం, గంజాయి, మత్తుపదార్థాలకు గురై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. వీరికి సరైన సమయంలో కౌన్సెలింగ్ అందిస్తే మంచి పౌరులుగా తయారు కాగలరన్నారు. సమావేశంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి శశికిరణ్, కార్యవర్గసభ్యులు మొగిలి, సుమన, వేణు, రజిత, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు సంజీవని

- నవజాత శిశువులకు నియోనాటల్ కేర్ అంబులెన్స్
- జిల్లాకొకటి చొప్పున గతేడాది ఇదే రోజున ప్రారంభం
- ఎంతోమంది చిన్నారుల ప్రాణాలు కాపాడిన వాహనం


అంబులెన్స్‌లో శిశువును తరలిస్తున్న సిబ్బంది



మంచిర్యాలకు సేవలు అందిస్తున్న నియోనాటల్ కేర్ అంబులెన్స్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణి ఏడు నెలల్లోనే ప్రసవించింది. శిశువు 900 గ్రాముల బరువుతో జన్మించగా.. ఆ శిశువు గుండెలో సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. వెంటనే నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లో ఆ శిశువును హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు అంబులెన్స్‌లు గత ఏడాది కాలంలో 2,392మందిని వివిధ ఆస్పత్రులకు తరలించాయి. నవజాత శిశువుల్లో అనారోగ్య సమస్యలు ఎదురైతే సరైన సమయానికి వైద్యం అందించేందుకు వరంగల్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తూ నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లు సంజీవనిలా నిలుస్తున్నాయి. గతేడాది ఆగస్టు 27న ఉమ్మడి జిల్లాలో జిల్లాకొకటి చొప్పున ప్రారంభించారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల్లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పుట్టిన శిశువుకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే సరైన సమయానికి మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరలకు శిశువులను తరలించేందుకు ఈ నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అప్పుడే పుట్టిన శిశువుకు ఆపద వస్తే తల్లి నుంచి దూరంగా పిల్లల ఆస్పత్రుల్లో చేర్చాల్సి వస్తుంది. హైదరాబాద్ వంటి నగరాలకు ఆ చిన్నారులను తరలించేందుకు అంబులెన్స్‌లు సంజీవనిలా మారాయి. ఐసీయూ సౌకర్యంతో వైద్యం అందిస్తూ ఉచితంగా తరలిస్తున్నారు.

అన్నిరకాల వసతులు

ఈ అంబులెన్స్‌ల్లో మినీ ఐసీయూగా ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో రూపొందించగా నిర్వహణ బాధ్యతలు జీవీకే ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈఎంఆర్‌ఐ)కి అప్పగించారు. ఆస్పత్రిలో ఉండే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ స్థాయి వసతులు కల్పించారు. మందులు, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాలతోపాటు అత్యవసర వైద్యసేవలకు శిక్షణ పొందిన మెడికల్ టెక్నీషియన్ ఉన్నారు. వైద్యసేవలతోపాటు సకాలంలో ఆస్పత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడుతూ తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపుతున్నారు.

ఏడాది కాలంలో శిశువులకు అందిన సేవలు

నెల	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
ఆగస్టు	04	04	10	05
సెప్టెంబర్	32	20	45	20
అక్టోబర్	40	25	40	32
నవంబర్	50	41	55	40
డిసెంబర్	47	41	59	42
జనవరి	60	40	62	51
ఫిబ్రవరి	52	38	52	45
మార్చి	79	35	62	47
ఏప్రిల్	78	45	60	51
మే	60	44	61	56
జూన్	62	49	55	47
జూలై	68	52	66	48
ఆగస్టు	60	52	60	43
మొత్తం	692	486	687	527

శిశువుల కోసం ఏర్పాటు


అత్యవసరంగా చిన్నారులను హైదరాబాద్ వంటి నగరాలకు త్వరగా చేర్చి వారికి సకాలంలో వైద్యం అందించేందుకు అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంతోమంది శిశువులకు సకాలంలో ఆసుపత్రికి చేర్చే అవకాశం దక్కింది. – ఎల్.రమేశ్, పైలట్, మంచిర్యాల

ప్రాణాలు కాపాడుతున్నాం


శిశువుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో టీఆర్ వినికా సదుపాయాలు కూడా కలిగి ఉన్నాయి. దీంతో శిశువులకు వైద్యం అందిస్తూ సకాలంలో ఇతర ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతున్నాం.

– టి.శ్రీనివాస్, ఈఎంటీ, మంచిర్యాల

వార్షిక క్రీడా కమిటీ నియామకం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 2024-25 వార్షిక క్రీడల కోసం నూతన కమిటీని నియమిస్తూ ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, చీఫ్ కోఆర్డినేటర్‌గా డీజీఎం అరవింద రావు, హానర్ సెక్రెటరీగా పాల్‌స్రుజన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ సీహెచ్ అశోక్, కోఆర్డినేటర్‌గా ఎస్.నర్సయ్యను నియమించారు. క్రీడా కేప్టెన్లుగా శ్రీనివాస్(బాస్కెట్‌బాల్), ఎద్దు సదయ్య(హాకీ), బీ.తిరుపతి(ఫుట్‌బాల్), బీ.చిన్నయ్య(వాలీబాల్), బీ.శశికాంత్(క్రికెట్), కే.రమేశ్(అథ్లెటిక్స్), కే.కార్తీక్(కబడ్డీ), ఆర్ చంద్రమోహన్ (కల్చరల్), టీ.బాపు(బాల్‌బ్యాడ్మింటన్), టీ.సురేశ్(ఇండోర్ ఈవెంట్స్), బీ.మల్లయ్య(పవర్ లిఫ్టింగ్), కే.సమ్మయ్య(బాడీబిల్డింగ్), ఎం.అజయ్(వెయిట్‌లిఫ్టింగ్), జీ.శ్రీకాంత్(స్విమ్మింగ్), కే.సంధ్య(ఉమెన్ ఈవెంట్స్), ఎం.శ్రీనివాస్(జనరల్ కేప్టెన్)గా నియమించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ జెడ్పీటీసీ


బానయ్యకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: తాండూర్ మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు సాలిగామ బానయ్య తన అనుచరగణంతో కాంగ్రెస్ గూటికి చేరారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే గడ్డం వినోద్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అతనితో పాటు మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కంపెల చిన్నయ్య , సీనియర్ నాయకుడు మాస వెంకటస్వామి తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, నాయకులు రహమత్‌ఖాన్, తిరుపతి, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

తీజ్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

జన్నారం: బంజారా కులస్తులు జరుపుకునే తీజ్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని బంజారా యువజన సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భుక్య రాజేశ్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తీజ్ ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల దైవం సేవాలాల్ జీవిత చరిత్రను భావితరాలకు అందించేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంకిషన్ నాయక్, భీంలాల్ నాయక్, సంతోష్‌నాయక్, మాన్‌సింగ్ నాయక్, సందేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు